ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY









జన వాణి వినిపిస్తాం..

- ఓటర్ల ఆకాంక్షలను నెరవేరుస్తాం
- మహిళలకు భద్రత, తాగునీరు, పరిశ్రమలకు పెద్దపీట
- తొలి అనుభవం వెల కట్టలేనిది
- నేడు అసెంబ్లీలో ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం

(కడప - ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి కడప జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానా లను టీడీపీ కూటమి గెలుచుకుంది. ఊహించని విజయాన్ని ఓటర్లు కూటమికి కట్టబెట్టారు. ఎన్నెన్నో ఆశలు, ఎంతో దూరదృష్టితో మాజీ సీఎం జగన్ సొంత గడ్డలోనే కూటమి అభ్య ర్థులను గెలిపించి జగన్ పార్టీకి మైండ్ బ్లాక్ అయ్యేలా చేశారు. కడప జిల్లా ఓటరు జనం జగన్ ఫ్యామిలీకే బానిసలంటూ ఆ పార్టీకి చెందిన కొందరు చెప్పుకొచ్చారు. బయట జిల్లాల్లో కూడా అలాగే సాగింది. వైసీపీ సోషల్ మీడియాలో ఉచ్చనీచాలు మరిచి కొందరు వైసీపీ శ్రేణులు చేసిన ప్రచారం సభ్య సమాజాన్ని తలదించుకునేలా చేసింది. ఇక అధికారం మాటున బికారీలు కూడా కబ్జాలు చేసి కోట్లు గడించారంటారు. అయితే జనం వీటన్నంటినీ భరించి సార్వత్రిక ఎన్నికల్లో బుద్ధి చెప్పారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై ఉమ్మడి కడప జిల్లావాసుల ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

ఎమ్మెల్యేలుగా గెలిచిన వారు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అయితే వీళ్లల్లో తొలిసారిగా ముగ్గురు అసెంబ్లీ గేటును టచ్ చేస్తు న్నారు. వారి ఆనందానికి అవధుల్లేవు. జనం గొంతుకను అసెంబ్లీసాక్షిగా ఎలుగెత్తుతామని చెబుతున్నారు.

పులివెందుల నుంచి జగన్

మాజీ సీఎం జగన్ ముచ్చటగా మూడోసారి అసెంబ్లీలోకి అడుగు పెట్టనున్నారు. 2014 ఎన్నికల్లో పోటీ చేసిన జగన్ ప్రతిపక్షానికే పరిమితమయ్యారు. ఇక 2019లో 151 సీట్లు గెలిచి రికార్డు సృష్టించి సీఎం అయ్యారు. అయితే 2024లో జగన్ పులివెందుల నుంచి గెలిచినప్పటికీ స్టేట్‌లో తన పార్టీకి చెందిన 11 మంది ఎమ్మెల్యేలు మాత్రమే గెలిచారు. దీంతో కనీసం ప్రతిపక్ష హోదా కూడా లేకుండాపోయింది. మరి ఈ ఐదేళ్లు జగన్ అసెంబ్లీకి వెళ్లి జనాల సమస్యలపై పోరాడతారా అన్న అనుమానం వ్యక్తమవుతోంది.


మహిళా చట్టాల మార్పు కోసం గళం విప్పుతా..



దివంగత ఎన్టీఆర్ టీడీపీని స్థాపించి తొమ్మిది నెలల్లో అధికారంలోకి వచ్చారు. అలాగే నన్ను కడప అసెంబ్లీ ఇన్‌చార్జ్‌గా నియ మించిన తొమ్మిది నెలల్లోనే ఎమ్మెల్యేగా గెలిచా. 1999 తరువాత టీడీపీ కడప అసెంబ్లీలో గెలవలేదు. అయితే సీఎం చంద్రబాబునాయుడు నాపై నమ్మకంతో టికెట్ ఇచ్చారు. నేను ఎప్పుడూ కూడా రాజకీయాల్లోకి వస్తానని కలలో కూడా ఊహించలేదు. మా ఫ్యామిలీ రాజకీ యంగా ఉన్నప్పటికీ నేను వాటి గురించి ఆలోచించలేదు. నన్ను ఇన్‌చార్జ్‌గా నియమించిన తరువాత నేనే ఊహించలేకపోయాను. తొమ్మిది నెలల కాలంలోనే చంద్రబాబు నమ్మకాన్ని వమ్ము చేయలేదు. కార్య కర్తలతో కలిసి గడప గడప వెళ్లాను. ప్రతి ఇంట్లో సమస్యలను తెలుసుకున్నా. ప్రతి కుటుంబాన్ని నా కుటుంబంగా భావించి సమస్యలు ఆలకించా. అయితే తన ఎన్నికల ప్రచారంలో కఠోర విషయాలు బయటికి వచ్చాయి. ముస్లిం మైనార్టీ మహిళలకు అన్యాయం జరుగుతోంది. ఆ కుటుంబాల్లో భర్త వదిలేయడంతో ఎందరో ఒంటరి మహిళలుగా బతుకుతున్నారు. కొందరు కావాలనే తలాక్ చెప్పి విడాకులు తీసుకుంటున్నారు. ముక్కుపచ్చలారని వయసులోనే పెళ్లిళ్లు చేసి వారికి ఊహ వచ్చే లోపే వదిలేసి వెళుతున్నారు. బాధితులు కేసులు పెట్టాలనుకున్నా కొందరి నిర్వాకం వల్ల న్యాయం జరగడం లేదు. ప్రస్తుతం ఉన్న చట్టాలతో 90 శాతం మహిళలకు న్యాయం జరగడం లేదు. భర్త వేధింపులు ఇతరత్రా వాటి వల్ల కడపలో ఎన్నో మైనార్టీ కుటుంబాలు, ఆడ బిడ్డలు రోడ్డున పడ్డారు. చిన్న వయసులోనే అటు భర్త వదిలేసి, నిరాదరణకు గురైతే పిల్లలతో ఆ మహిళలు పడుతున్న బాధలు నేను కళ్లారా చూశాను. అందుకే మహిళల రక్షణ కోసం చట్టాల్లో మార్పు రావాలి. ఎవరో ఇద్దరు ముగ్గురు కోసం బాధితులకు అన్యాయం చేయకూడదు. ఎంతో మంది మహిళలు బాధితులుగా మారారు. అలాంటి వారి కోసం ఓ ప్లాట్‌ఫాం ఇవ్వాలి. అందుకు అసెంబ్లీ వేదికగా మహిళల రక్షణ కోసం చట్టంలో మార్పులు తెచ్చేందుకు పోరాడతా. ఇక కడప సిటీని రాష్ట్రంలోనే నెంబర్‌వన్ సిటీగా మారుస్తాను. కడప అభివృద్ధిపై నాకు విజన్ ఉంది.

- ఆర్.మాధవి, కడప ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు కురువృద్ధుడు



ప్రొద్దుటూరు ఎమ్మెల్యే ఎస్.వరద రాజులరెడ్డి రాజకీయ కురువృద్ధులు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన మరోసారి గెలుపొందారు. నేడు మరోసారి ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేస్తున్నారు. ఇక బద్వేలు వైసీపీ ఎమ్మెల్యే డాక్టర్ సుధా రెండోసారి ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేస్తున్నారు. 2019 ఎన్నికల్లో డాక్టర్ ఎమ్మెల్యే సుధా భర్త వెంకటసుబ్బయ్య ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే అనారోగ్యంతో ఆయన మృతి చెందడంతో 2022లో జరిగిన ఉప ఎన్నికల్లో డాక్టర్ సుధా గెలుపొందింది. అయితే మరోసారి ఆమె ఎన్నికైంది. ఇక జమ్మల మడుగు నుంచి బీజేపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే ఆది నారాయణరెడ్డి గెలుపొందారు. ఈయన 2014లో వైసీపీ నుంచి గెలిచి టీడీపీలో చేరి మంత్రి అయ్యారు. 2019 ఎన్నికల్లో కడప పార్లమెంటు నుంచి పోటీ చేసి పరాజయం పొందారు. ఇక 2024 ఎన్నికల్లో కూటమి నుంచి బీజేపీ అభ్యర్థిగా గెలుపొందారు. ఈయన మరోసారి ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.


సమగ్రాభివృద్ధి కోసం పోరాడతా..



కమలాపురం నియోజకవర్గం ఓటర్లు తనను గెలిపించి అసెంబ్లీకి పంపించారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అసెంబ్లీలో వారి గొంతుకను వినిపిస్తా. ప్రతి రోజూ నిత్య విద్యార్థిలా అభివృద్ధి కోసం ఏం చేయాలి, ఎలా పోరాడాలి అని మననం చేసుకుంటా. కమలాపురంలో వనరులు పుష్కలంగా ఉన్నాయి. వాటిని ఉపయోగించుకుంటే అటు వ్యవసాయం, ఉపాధి, విద్యాపరంగా నెంబర్‌వన్‌గా చేయవచ్చు. ఆ దిశగా ఈ మూడింటినీ పరిష్కరిస్తే నేను సంతృప్తి చెందుతా. కమలాపురంలో ప్రతి ఎకరాకు సాగునీరందించేలా ప్రణాళిక చేసుకున్నాను. అలాగే ప్రతి ఊరిలో ఇంటింటికీ తాగునీరు ఇచ్చేలా చేస్తాం. ఇక పరిశ్రమలకు అనువైన భూమి, నిక్షేపాలు, ఎయిర్‌పోర్టు మా దగ్గరే ఉన్నాయి. కమలాపురం అంటేనే ఓ బ్యాక్‌వర్డ్ ఏరియా. అయితే ఇక్కడున్న వనరులు ఉపయోగించుకుని పరిశ్రమల కోసం ఉపయోగిస్తాం. వీటన్నింటిపై అసెంబ్లీలో ప్రస్తావించి.. జనం మెప్పు పొందుతా.

- పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే

ప్రతి ఎకరాకు సాగునీరందించడానికి..



మైదుకూరు నియోజకవర్గం వ్యవసాయ ప్రాంతం. ఈ ప్రాంతంలో ప్రతి ఎకరాకు సాగునీరందిస్తే ఇక్కడ సిరులు పండిస్తారు. నేను ఎమ్మెల్యేగా లేకపోయినా కూడా టీడీపీ హయాంలో వందల కోట్లు ఖర్చు పెట్టి రోడ్లు, డ్రైనేజీలతో పాటు సాగునీటి కోసం ఖర్చు చేశాను. అయితే ఈసారి మైదుకూరు జనం నన్ను గెలిపించారు. నియోజకవర్గ ప్రజల ఆశలను నెరవేరుస్తా. ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తా. పల్లెపల్లెకూ రోడ్లు, తాగునీరు లాంటి సదుపాయాలు కల్పించి.. నా మార్కు డెవలప్‌మెంటు చూపిస్తా. ఇక అసెంబ్లీలో అవకాశం వచ్చిన ప్రతి నిమిషం నా జనం కోసం ప్రస్తావిస్తా.

- పుట్టా సుధాకర్‌యాదవ్, మైదుకూరు ఎమ్మెల్యే



ఊపందుకున్న ఖరీఫ్

- సాగుకు సన్నద్ధమైన రైతన్నలు
- 17వ తేదీ నాటికి 1369 హెక్టార్లలో సాగు
- విస్తారంగా వర్షాలు
- జూన్‌లో అధిక వర్షపాతం
- 68.2 మి.మీకు గాను 90.8 మి.మీ
- అన్నదాతల్లో ఆనందం

కడప(రూరల్) జూన్ 20: జిల్లాలో ఖరీఫ్ సాగు ఊపందుకుంది. ప్రతి ఏడాది ఆలస్యంగా వస్తున్న నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది ఖరీఫ్‌లో కాస్త ముందుగా రావడం.. వర్షాలు కూడా సమృద్ధిగా కురుస్తుండడంతో రైతన్నలు ఏరువాక సాగుకు వడివడిగా అడుగులు వేస్తు న్నారు. దీనికితోడు నూతనంగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం అన్నదాతలకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. ఈమేరకు 2024 ఖరీఫ్ సాగుకు రైతన్నలకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, యంత్ర పరికరాలు తదితర వాటిని సకాలంలో అందించేందుకు చర్యలు చేపడుతున్నారు.

విస్తారంగా వర్షాలు

ఈ ఏడాది జూన్ 7న జిల్లా అంతటా 330.6 మీ.మీటర్ల వర్షపాతం నమోదైంది. ఆ తరువాత 9న 97.6 మి.మీ, జూన్ 10న 160 మి.మీ, జూన్ 12న 370 మి.మీ, జూన్ 18న 104.2 మి.మీ, జూన్ 19న 313.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఇలా జూన్ నెల మొత్తం 68.2 మిల్లీ మీటర్ల వర్షపాతం అవసరం కాగా జూన్ 19 నాటికే 90.8 మి.మీ అధిక వర్షపాతం నమోదైంది. ఇలా జూన్ నెలలో ఆశించిన మేర వర్షపాతం నమోదు కావడంతో ముమ్మరంగా రైతులు ఎరువాక సాగుకు నడుం బిగించారు. ఇప్పటికే టీడీపీ ప్రభుత్వంలో సబ్సిడీ ధరతో రైతులకు అవసరమైన వేరుశనగ విత్తనకాయలు అందించడంతో పాటు నాణ్యమైన పత్తి, వరి విత్తనాలు అందేలా చర్యలను చేపట్టింది.

ముమ్మరంగా పంటల సాగు

2024 ఖరీఫ్‌లో జిల్లా అంతటా 75,129 హెక్టార్లలో పంటల సాగు లక్ష్యం కాగా బుధవారం ఒక్కరోజే 1.82 శాతం అంటే 1369 హెక్టార్లలో పంటలు సాగుకు నోచుకున్నాయి. ఇందులో పత్తిపంట 24,086 హెక్టార్లకు గాను 1031 హెక్టార్లలో, వేరుశనగ 5971 హెక్టార్లకు 146 హెక్టార్లలో, మినపపంట 2642 హెక్టార్లకు 130 హెక్టార్లలో, వరిపంట 31,171 హెక్టార్లకు 28 హెక్టార్లలో సాగుకు నోచుకున్నాయి. జూన్ నెల చివరి నాటికి ఎన్నడూలేని విధంగా పంటల సాగు నమోదుకు నాంది పలకనుందని వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఎ.నాగేశ్వరరావు పేర్కొన్నారు.

సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలు పంపిణీ

2024 ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగుకు ప్రభుత్వం సబ్సిడీ ధర కింద జిల్లాలోని 11 మండలాలకు 5849 క్వింటాళ్ల వేరుశనగ కాయలను మంజూరు చేసింది. ఈ మేరకు ఆయా మండలాల పరిధిలోని 5966 మంది రైతులు 4892.7 క్వింటాళ్లకు తమ వాటా డబ్బును చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వీరిలో జూన్ 19 నాటికి 3865 మంది రైతులు ఆయా అధికారుల నుంచి 3241.8 క్వింటాళ్ల వేరుశనగ విత్తనకాయలను తీసుకెళ్లి సాగుకు ఉపక్రమించారు. ఇందులో నిన్న, మొన్న సాగుకు పూర్తిస్థాయి వర్షాలు పడడంతో ఇప్పటికి 11 మండలాల పరిధిలో 146 హెక్టార్లలో విత్తనం పడింది.



వ్యవసాయ పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు గడువు పొడిగింపు



కలికిరి, జూన్ 20: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో నడుస్తున్న వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్లకు 2024-25 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు గడువు పొడిగించారు. గత నెల 31న జారీ అయిన నోటిఫికేషన్ మేరకు దరఖాస్తులు పంపుకోవడానికి జూన్ 20న చివరి తేదీగా నిర్ణయించారు. ప్రస్తుతం జూన్ 30వ తేదీ వరకూ దరఖాస్తులు పంపుకొనేందుకు వీలుగా గడువు పెంచారు. వ్యవసాయం, సీడ్ టెక్నాలజీ, ఆర్గానిక్ వ్యవసాయం, వ్యవసాయ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులో రెండు లేక మూడు సంవత్సరాల డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు పొందడానికి ఈ సంవత్సరం పదో తరగతి ఉత్తీర్ణులయిన వారు మాత్రమే అర్హులు. దరఖాస్తులను ఎన్జీ రంగా యూనివర్శిటీ వెబ్‌సైట్ ద్వారా పంపుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ఇతర వివరాల కోసం 80081 04977, 90005 23420, 80085 54448 నెంబర్లలో సంప్రదించవచ్చు.

భూకబ్జాల బాట పడితే తాట తీస్తాం..

- సొంత పార్టీ నేతలైనా సరే.. కేసులు పెట్టి బహిష్కరిస్తాం
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస రెడ్డి



(కడప - ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూకబ్జాలు, దాడులు హత్యలు మహిళలపై వేధింపులు ఇలా ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు లేకుండా కడప జిల్లా జనం ప్రశాంతంగా ఉండే పాలన అందిస్తాం. ఎవరి పనులు వారు చేసుకుం టూ వారి కుటుంబాలో అంతా ప్రశాం తంగా ఉండాలన్నది టీడీపీ లక్ష్యం. అయితే టీడీపీ పేరు చెప్పుకొని భూకబ్జాలకు, సెటిల్ మెంట్లకు పాల్పడితే వారి తాట తీస్తామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి హెచ్చ రించారు. గురువారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ వైసీపీ పాలనలో కడప భూక బ్జాలకు నిలయంగా మారింది. వైసీపీ దాష్టీకాన్ని భరించలేకనే నిన్న జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి కడప జిల్లాలో ఏడు సీట్లను మాకు గెలిపించారు. మేం కూడా జనం మెప్పించేందుకు పాలన మొదలుపెడుతున్నాం. ఎక్కడే కానీ జనానికి ఇబ్బంది పెట్టడం కానీ, వారి ఆస్తులను కొట్టే యాలని చూస్తే వారిపై పీడీ యా క్టు నమోదు చేసి జైల్లో పెడతాం. కడప నగరం వైసీపీ పాలనలో భూకబ్జాలుగా మారింది. ఎన్నికల ప్రచారంలో ఎంతో మంది బాధితులు కలిశారు. అందుకే కడప ఎమ్మెల్యేగా మాధవీ గెలిచిన తరువాత ఆమె గట్టి స్టాండ్ తీసుకున్నారు. భూకబ్జారాయుళ్ల భరతం పట్టాలి... అన్యాక్రాంతమైన ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలను స్వాధీనం చేసుకుని తిరిగి అప్పగించాలని డిసైడ్ అయ్యారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి కట్టడాలు కడితే కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించాం. పోలీసు పెట్రోలు బంకు పక్కన వివాదా స్పదంగా మారిన స్థలంపై నిర్మాణాలు కూడా నిలిపివేయాలంటూ ఫిర్యాదు చేశాం. ఎవరైనా మా పేరు చెప్పి భూకబ్జాలు, పోలీసుస్టేషన్‌లో, ఎక్కడైనా సెటిల్‌మెంట్లకు పాల్పడితే వారి తాట తీస్తాం. వారిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తాం. టీడీపీలో సభ్యత్వం ఉంటే రద్దు చేసి బహిష్కరిస్తామని హెచ్చరించారు.

వైద్యశాఖలో ఫెవికాల్ వీరులు

- డిప్యూటేషన్లపై ఏళ్ల తరబడి తిష్ట
- డిప్యూటేషన్ రద్దు జీవో వీరికి వర్తించదా

కడప(కలెక్టరేట్), జూన్ 20: వైద్య ఆరోగ్యశాఖలో నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారుల సహకారమో లేక రాజ కీయ పలుకుబడో.. కానీ పని సర్దుబాటు, పరిపాలన సాకుతో ఏళ్ల తరబడి తిష్ట వేశారు. అంతేకాదు వైద్యశాఖలో వీరు ప్రతి పనికి తామే అంటూ అధికారు లకు కీలక సలహాదారులుగా చక్రం తిప్పుతున్నారనే విమర్శలున్నాయి. విధులు ఒకచోట, జీతం మరోచోట అనే విధంగా వారాంతంలో 3 రోజులు పాటు అక్కడ, ఇక్కడ ఉంటూ... డిప్యూటేషన్ల రద్దు నిబంధనలు తమకేమి వర్తించవంటూ వ్య వహరిస్తున్న దాదాపు 10 మందికి పైగా ఉద్యోగుల తీరుపై వైద్యశాఖ ఉద్యోగు ల్లో తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక రూ.50వేలు కన్సాల్టేషన్ జీతం తీసు కునే బాధ్యతల నిర్వహణకు ఓ అధికారికి గజిటెడ్ ర్యాంకు అంటగట్టారు. ఈయ న ప్రాథమిక ఆసుపత్రుల తనిఖీలు చేప డుతూ కిందిస్థాయి ఉద్యోగులైన ఏఎన్ ఎంలను పనులు సక్రమంగా చేయడం లేదంటూ, యాప్‌ల్లో రోజు వారీగా నివే దికలు అప్‌లోడు చేయడం లేదంటూ బెదిరించడంలో దిట్ట అని ఆశాఖ ఉద్యో గులు అధికారి తీరుకు విస్తుపోతున్నారు. గత ప్రభుత్వం ఉద్యోగుల డిప్యూటే షన్లకు సంబంధించి రద్దు చేస్తూ జీవో జారీ చేసింది. అయితే ఈ నియమ నిబంధనలు మాత్రం వైద్యశాఖలో పట్టించుకునే అధికారులు కానరాక పోవడంతో దాదాపు 10 మందికి పైగా పని సర్దుబాటు పేరుతో జిల్లా హెడ్ క్వార్టర్‌లో తిష్ట వేయడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. వీరిలో ఎక్కువ మంది మలేరియా విభాగంలో సేవలందిస్తుండడం గమనార్హం.

జమ్మలమడుగులో పనిచేసే ఉద్యోగి రెండేళ్లుగా కడప డీఎంఅండ్‌హెచ్ఓలో విధులు నిర్వహిస్తున్నారు. అలాగే అనంతపురం జిల్లా కేంద్రంలో పని చేయాల్సిన ఓ సీహెచ్ఓ కడపలో దాదాపు రెండు దశాబ్దాలుగా తిష్ట వేశారు. సింహాద్రిపురం మండలంలో పని చేయా ల్సిన మరో సీహెచ్ఓ పని సర్దుబాటు పేరుతో కడపలో విధులు నిర్వహిస్తున్నారు. మలే రియా విభాగంలో మరో 6 మంది 14 జీవో కింద పనిచేస్తుండగా, డీఎంఅండ్‌హెచ్ఓ కార్యా లయంలో మరో ఉద్యోగి ఉండడం గమనార్హం. ఇకపోతే సిద్దవటం, పులివెందుల సబ్ యూని ట్ ఆఫీసరు 3 ఏళ్లుగా తిష్టవేయగా, కమలాపురం నియోజకవర్గంలో మరో ఉద్యోగి కడపలోనే మకాం వేశారు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో మరికొందరు ఉద్యోగులు గుట్టుచప్పుడు కాకుండా పని సర్దుబాటు పేరుతో కొనసాగుతున్నారని, వారిని పూర్వపు స్థానాలకు సాగనంపాలని లేకపోతే పైస్థాయి అధికారులకు ఫిర్యాదులు చేసేందుకు సిద్ధమవుతున్నారు.



మోకాళ్లపై తిరుమలకు

- మొక్కు చెల్లించుకున్న టీడీపీ అభిమాని



కలికిరి, జూన్ 20: మండలంలోని గుట్టపాలెం పంచాయతీ యల్లంపల్లెకు చెందిన గౌరి అనే టీడీపీ వీరాభిమాని అయిన బీసీ మహిళ తిరుమల శ్రీవారికి గురువారం వినూత్న రీతిలో క్లిష్టతరమైన మొక్కు చెల్లించుకున్నారు. పీలేరు నుంచి టీడీపీ తరపున ఎమ్మెల్యేగా నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి గెలుపొంది, రాష్ట్ర సీఎంగా చంద్రబాబు పగ్గాలు చేపడితే మోకాళ్ల మీద నడుస్తూ తిరుమల వెంకటేశ్వరస్వామి దర్శనం చేసుకుంటానని మండలంలోని గుట్టపాలెం పంచాయతీకి చెందిన మల్లికార్జున గౌడ్ భార్య గౌరి ఎన్నికల సమయంలో మొక్కుకుంది. ఆమె రెండు కోర్కెలు నెరవేరడంతో అలివేలుమంగాపురం వద్ద శ్రీవారి మెట్టు నడక మార్గంలో గురువారం ఉదయం 6 గంటలకు పూజలు నిర్వహించి మోకాళ్ల మీద నడక సాగించింది. భర్త మల్లికార్జున, కుమారుడు కూడా ఆమెను అనుసరించారు. ఆమె మధ్యాహ్నం 3.30 గంటలకు తిరుమలకు చేరుకుంది. ఈ సందర్భంగా పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ఫోనులో గౌరి, ఆమె భర్త మల్లికార్జునను పరామర్శించి అభినందించారు. గౌరికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

జల కళ.. పక్షుల కిలకిల











వర్షాకాలం ప్రారంభమైంది. వేసవిలో ఎండిపోయిన పెన్నా నీటితో కళకళలాడుతోంది. నీటిలో పక్షులు కిలకిలలాడుతూ కనువిందు చేస్తున్నాయి. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పై ప్రాంతం నుంచి నీళ్లు రావడంతో ఆదినిమ్మాయపల్లె డ్యాం వద్ద సందడి నెలకొంది. పెద్ద ఎత్తున నీళ్లు పారుతుండటంతో.. దిగువ నుంచి ఎగబడుతున్న చేపల కోసం విదేశీ పక్షులు ఇక్కడకు వస్తున్నాయి. వీటిని చూసేందుకు పర్యాటకులు సైతం పెద్ద సంఖ్యలో వస్తున్నారు. విదేశీపక్షులను చూసిన పిల్లలు కేరింతలు కొడుతున్నారు. ప్రతి రోజూ పక్షులు ఉదయం వచ్చి సాయంత్రం తిరిగి వెళ్లిపోతున్నాయని స్థానికులు తెలిపారు.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప

వారసత్వ పరిరక్షణకు దిక్సూచి 'మన చరిత'

వైవీయూ వైస్ చాన్సలర్ చింతా సుధాకర్



మన చరితను ఆవిష్కరిస్తున్న వైస్ చాన్సలర్ చింతా సుధాకర్, ఇంటాక్ ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), జూన్ 20 : మన జిల్లా సంస్కృతి వారసత్వ పరిరక్షణతో పాటు పర్యాటకాభివృద్ధికి మన చరిత బులిటిన్ దిక్సూచి లాంటిదని వైవీయూ వైస్ చాన్సలర్ చింతా సుధాకర్ అన్నారు. గురువారం ఇంటాక్ ఆధ్వర్యంలో మన చరిత బులిటిన్‌ను ఆయన ఆవిష్కరించారు. కడప నగరం మానస ఇన్ సమావేశ మందిరంలో ఇంటాక్ కన్వీనరు లయన్ కె.చిన్నపరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ మాట్లాడుతూ మన జిల్లాలో ఘనమైన వారసత్వ ప్రదేశాలు, చారిత్రక కట్టడాలు, విలక్షణమైన సంస్కృతీక సాంప్రదాయాలు న్నాయన్నారు. వీటి పరిరక్షణకు ప్రభుత్వంతోపాటు ఇంటాక్ లాంటి సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. వారసత్వ సంపదను రక్షించుకోగలిగితే జిల్లా పర్యాటకంగా కూడా అభివృద్ధి చెంది ప్రభుత్వానికి ఆదాయం రాడంతోపాటు యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. చిన్నపరెడ్డి మాట్లాడుతూ జిల్లా వారసత్వ సంస్కృతి సాంప్రదాయ రక్షణ విషయంలో ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించడంతోపాటు ఈ యజ్ఞంలో అందరినీ బాగస్వాముల చేసేందుకు ఈ బులిటిన్‌కు రూపకల్పన చేశామన్నారు. ఇంటింటా ఇంటాక్ నినాదంతో ప్రతి ఇంటా మన చరిత ఉండేలా రచనలకు శ్రీకారం చుడుతున్నామన్నారు. సభ్యత్వం పెంచుకోవడంతో ముందడుగు వేయగలమన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంటాక్‌ను జిల్లా నలుమూలలా విస్తరింపజేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఈశ్వర్‌రెడ్డి, ఇంటాక్ పూర్వకన్వీనరు ఇలియాస్‌రెడ్డి, వాసవీ గ్రాఫిక్స్ అధినేత సీవీ రమేశ్, కోకన్వీనరు సుబ్బారెడ్డి, గోసుల వెంకట్రామిరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇంటాక్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలో ఇరువురికి తీవ్రగాయాలు

పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు



దాడిలో గాయపడిన గణేష్

కడప (క్రైం), జూన్ 20 : కడప నగరంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో రాజీవ్ పార్కు సమీపంలోని ఓ కర్రీస్ దుకాణం సమీపంలో బుధవారం రాత్రి జరిగిన ఘర్షణలో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... విష్ణువర్ధన్ ఆలియాస్ విష్ణు, నాని, నరసింహాచారి ఆలియాస్ నరసింహకు, గణేశ్ ఆలియాస్ సంజు, ఓబులేసు ఆలియాస్ బబ్లూలపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఎర్రముక్కపల్లె రైల్వేగేటు మార్గమధ్యంలో షేక్ మస్తాన్, గణేశ్, ఓబులేసు అనే ముగ్గురు మద్యం సేవించారు. కర్రీస్ కోసం రాజీవ్ పార్కు వైపు మోటారు సైకిల్‌లో ఆ ముగ్గురు వచ్చారు. అక్కడ గతంలో మనస్పర్థలు ఉన్న విష్ణువర్ధన్, నాని, నరసింహాచారి ఎదురుపడడంతో మొదట ఒకరికొకరు వాగ్వివాదం చేసుకున్నారు. తరువాత ఘర్షణకు దిగారు. ఈ ఘర్షణలో గణేశ్‌కు వీపుపై గాయాలయ్యాయి. ఓబులేసుకు చేతికి, కుడి వైపు చెవికి గాయాలయ్యాయి. ఈ సంఘటనలో షేక్ మస్తాన్ స్వల్పంగా గాయపడ్డాడు. ఈ సంఘటనపై కడప వన్‌టౌన్ సీఐ భాస్కర్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి విచారణ చేపట్టారు. నిందితుల్లో విష్ణువర్ధన్, నరసింహ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. నానీ పరారీలో ఉన్నాడు. ఈ సంఘటనపై బాధితుల్లో ఒకరైన షేక్ మస్తాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

హరిత హోటల్‌లో ఏసీలు, గీజర్‌లు చోరీ

కడప (క్రైం), జూన్ 20 : కడప నగరంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని హరిత టూరిజం హోటల్‌లో చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు దాదాపు రూ.50 వేల విలువైన సామగ్రిని అపహరించుకుని వెళ్లారు. పోలీసుల వివరాల మేరకు... హోటల్ ముందుభాగాన రోడ్డు, కాల్వ నిర్మాణం పనుల వల్ల ఏసీ ఇన్‌డోర్‌లు, ఔట్ డోర్‌లు, గీజర్లను పక్కకు తీసి ఉంచారు. దీనిని ఆసరాగా చేసుకున్న దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటనపై హరిత హోటల్ మేనేజరు మల్లికార్జున పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ సంఘటనపై సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.

ఉరి వేసుకుని ఒకరి మృతి

చాపాడు, జూన్ 20: మండలంలోని వెదురూరు గ్రామంలో గురువారం ఒక వ్యక్తి (29) తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. బేల్దారి పనిచేస్తూ జీవనం సాగించేవాడు. కొంత కాలంగా అప్పుల బాధతో సతమతమవుతూ ఉండేవాడని తెలిపారు. ఇటీవల అప్పులు ఎక్కువ కావడంతో డబ్బులిచ్చినవారు వత్తిడి చేయడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

చైర్మన్ పదవికి రాజీనామా

వీరపునాయునిపల్లె, జూన్ 20: మండలంలోని సంగమేశ్వర ఆలయం చైర్మన్ పదవికి ఎన్‌పి శివాంజనేయరెడ్డి రాజీనామా చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చైర్మన్‌గా ఎన్నికైన ఆయన ఆలయ అభివృద్ధికి కృషి చేశారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తన పదవికి స్వచ్ఛందంగా రాజీనామాను అందించినట్లు తెలిపారు.

సుంకుసత్రం భూముల వేలం పాట



వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 20: సుంకుసత్రం భూములకు నిర్వహించిన వేలం పాటకు విశేష స్పందన లభించింది. గురువారం శివాలయం వీధిలో ఉన్న సుంకు వెంకటసుబ్బయ్య సత్రం ఈఓ కార్యాలయంలో వేలంపాట నిర్వహించారు. సుంకుసత్రం సంబంధించి మాలేపాడులో సర్వేనంబరు 26లోని 162.17 ఎకరాల భూమికి వేలం నిర్వహించారు. 25 మంది పాల్గొన్నారు. మాలేపాడుకు చెందిన కె.సుబ్బారెడ్డి ఏడాదికి రూ.4.75 లక్షలు చెల్లించేలా వేలంపాట దక్కించుకున్నారు. గతంలో ఏడాదికి రూ.2.10 లక్షల ఆదాయం ఉండగా ఈ ఏడాది రూ.4 లక్షలకు పెరగడం హర్షణీయమని ఈఓ రామచంద్రాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ నరసింహసింగ్, సుంకుసత్రం ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజశేఖర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



మహిళకు సెల్‌ఫోన్‌ను అందిస్తున్న రైల్వే పోలీసు

కడప (ఎడ్యుకేషన్), జూన్ 20 : ఇరువురు ప్రయాణికులు తమ మొబైల్ ఫోన్లను రైలులో మరిచిపోగా ఆర్‌పీఎఫ్ పోలీసులు వాటిని గుర్తించి ప్రయాణికులకు అందించారు. ఈ ఘటన కడప రైల్వేస్టేషన్‌లో జరిగింది. అందుకు సంబంధించిన వివరాలను కడప ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. జయంతి ఎక్స్‌ప్రెస్‌లో ఒక ప్రయాణికుడు తన సెల్‌ఫోన్‌ను మరిచిపోయాడు. విధుల్లో ఉన్న ఆర్‌పీఎఫ్ సిబ్బంది ఆ మొబైల్ ఫోన్‌ను గ్తురించి ఆర్‌పీఎఫ్ కార్యాలయంలో ఉంచారు. అలాగే తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో కూడా ఓ ప్రయాణికురాలు తమ మొబైల్ మరిచిపోయి ఇంటికి వెళ్లింది. దీన్ని గుర్తించిన ఆర్‌పీఎఫ్ పోలీసు ఆ మొబైల్‌ను కూడా కార్యాలయంలో ఉంచారు. మొబైల్స్ పోగొట్టుకున్న వ్యక్తులు తమ మొబైల్‌కు తిరిగి ఫోను చేయగా, ఆర్‌పీఎఫ్ కార్యాలయంలో ఫోన్లు ఉన్నాయని, తగిన ఆధారాలు తీసుకువచ్చి ఫోన్లు తీసుకుపోవాలని సూచించారు. ప్రయాణికులు తగిన ఆధారాలతో రాగా వారికి మొబైల్ ఫోన్లను ఆర్‌పీఎఫ్ అధికారులు అందించారు. ఈ మేరకు ఆర్‌పీఎఫ్ సిబ్బంది భాస్కరరావు, ప్రభాకర్‌రెడ్డి, అకీరాను ఆర్‌పీఎఫ్‌సీఐ శ్రీనివాసులు అభినందించారు.

'ఉపాధి'లో అవకతవకలు

● అవెన్యూ ప్లాంటేషన్‌లో కనబడని మొక్కలు ● లక్షల్లో ప్రజాధనం వృథా



ఎండిపోయిన మొక్కలకు కంప పాతిన దృశ్యం

కలసపాడు, జూన్ 20: వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకంలో అవకతవకలు జరిగాయి. అవెన్యూ ప్లాంటేషన్ ద్వారా రోడ్లకిరువైపులా మొక్కలను పెంచేందుకు మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు వెచ్చించారు. అయితే నాటిన మొక్కలు ఎక్కడా కనిపించడం లేదు. ఈవిషయమై సంవత్సరం క్రితం కథనాలు కూడా వచ్చాయి. అప్పటి అధికార పార్టీ నాయకులు సంబంధిత ఉపాధి హామీ అధికారులు కుమ్మక్కై నిధులను స్వాహా చేశారు. దీనిపై ఓ మహిళా అధికారి పరిశీలనకు వచ్చి ఐదు రోజుల పాటు మండలంలో సమీక్ష నిర్వహించి ఎక్కడా అవకతవకలు జరగలేదంటూ... నివేదిక ఇచ్చి తూతూ మంత్రంగా కొద్దిపాటి అపరాధ రుసుము విధించి వెళ్లిపోయింది.

అవెన్యూ ప్లాంటేషన్‌లో కనిపించని మొక్కలు

కలసపాడు మండలంలో కరోనా తరువాత ప్రజలకు ఉపాధి హామీ పనుల ద్వారా రూ.2 కోట్ల పైచిలుకు అవెన్యూ ప్లాంటేషన్‌లో నిధులు వెచ్చించి మొక్కలు నాటారు. మొక్కలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేశారు. అనంతరం మొక్కలను రక్షించేందుకు చుట్టూ ముళ్ల కంపల ఏర్పాటుకు కూడా నిధులను వెచ్చించారని రికా ర్డుల్లో మాత్రం పొందుపరిచారు. కానీ ఎక్కడా కూడా అవెన్యూ ప్లాంటేషన్ ద్వారా నాటిన మొక్కలు మాత్రం కనిపించడం లేదు. అవెన్యూ ప్లాంటేషన్ ద్వారా తూతూ మంత్రంగా మొక్కలు నాటాం అన్నట్లుగా ఉంది.

ట్యాంకర్లతో నీరు తోలితే మొక్కలు ఎక్కడ?

మండలంలో దాదాపు 13 పంచాయతీల్లో 38 గ్రామాలు ఉన్నాయి. ప్రతి పంచాయతీకి ఒక ఫీల్డ్ అసిస్టెంటు ఉన్నాడు. అవెన్యూ ప్లాంటేషన్‌లో దాదాపు మండలంలోని ప్రతి పంచాయతీలో వేసవి కాలంలో నీటిని తోలి మొక్కలను సంరక్షించామంటూ గతంలో పనిచేసిన మండల ఉపాధి హామీ అధికారి బిల్లులు చేశారు. కానీ ఆ మొక్కలు ఎక్కడ అని పలువురు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని లింగారెడ్డిపల్లె, రాజుపాలెం, కలసపాడు, మహానంది పల్లె, తెల్లపాడు, రామాపురం, చింతలపల్లె శంకవరం, పిడుగుపల్లె పంచాయతీల్లో ఎక్కువగా మొక్కలు నాటినట్లు బిల్లులు చేసుకున్నట్లు తెలుస్తుంది. ఈ విషయమై గతంలో కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు.

ప్రజాప్రతినిధులే ఉపాధి హామీ కూలీలు


మండలంలో ఉపాధి హామీ పథకం గత వైసీపీ ప్రజాప్రతినిధులు వారి అనుయాయుల ఆధ్వర్యంలోనే నడించింది. కలసపాడులో ఓ ప్రజాప్రతినిధి కొడుకు బంధువులు నిత్యం ఉపాధి పనులకు వెళుతున్నట్లు వంద రోజులు పనిదినాలు నమోదయ్యాయి. అలాగే మరో నాలుగైదు పంచాయతీల్లో ఇదే విధమైన పరిస్థితి. కేవలం అధికారాన్ని అడ్డం పెట్టుకుని గతంలో ఏపీవోగా పనిచేసిన అధికారి ఇష్టానుసారం బిల్లుల చెల్లింపు చేశారని తెలుస్తోంది. ఈ విషయమై ప్రస్తుతం కలసపాడు మండల ఉపాధి హామీ అధికారిగా విధులను నిర్వహిస్తున్న శివశంకర్‌ను వివరణ కోరగా.. ఉపాధి హామీ పథకంలో అవెన్యూ ప్లాంటేషన్ ద్వారా చేసిన పనులు మూడు సంవత్సరాలైందని, ఇందుకు సంబంధించిన రికార్డులు ఆన్‌లైన్‌లో లేవని, వాటిని ఆన్‌లైన్‌లో నుంచే తొలగించారని తెలిపారు.



మొక్కలు ఉన్నట్లు చూపిస్తున్న దృశ్యం

బీజేపీ సీనియర్ నాయకుడు

కొవ్వూరు బాలచంద్రారెడ్డి మృతి



కొవ్వూరు బాలచంద్రారెడ్డి (ఫైల్)

ప్రొద్దుటూరు, జూన్ 20: బీజేపీ సీనియర్ నాయకుడు కొవ్వూరు బాలచంద్రారెడ్డి (67) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. పట్టణాభివృద్ధి సంఘం అధ్యక్షుడిగా ఆయన ప్రొద్దుటూరు ప్రజలకు అనేక సేవలందించారు. వృత్తిరీత్యా క్లాస్-1 కాంట్రాక్టర్. పేదల కోసం రొట్టే, పప్పు తక్కువ ధరకు అందించి అందరి మన్ననలు పొందారు. నిత్యావసర సరుకులు కూడా తక్కువ ధరకు అందించేలా స్టాల్స్ పెట్టారు. వర్షాలకు మడూరు కాల్వ పొంగి పేదల ఇళ్లలో నీరు చేరితే కాల్వలో తెప్ప వేసుకుని నిరసన చేపట్టారు. కాల్వ ఆధునీకరణ కోసం పోరాడాడు. వైసీపీ ప్రభుత్వంలో మున్సిపల్ అనిబీసెంటు హైస్కూల్‌లో కూరగాయల మార్కెట్ పెట్టవద్దని హైకోర్టులో కేసులు వేసి పోరాడాడు. అప్పటి ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్ రాధ బాలచంద్రారెడ్డిపై కక్షకట్టి కోనేటి కాల్వ వీధిలో బాలచంద్రారెడ్డి కొత్తగా ప్రారంభించిన సూపర్ మార్కెట్‌కు అనుమతులు లేవని విద్యుత్ సరఫరా నిలిపివేయించి మూయించారు. దీంతో అతన్ని ఆర్థికంగా తీవ్రంగా నష్టపరిచడం అవమానించడంతో ఆయన వైసీపీ ప్రభుత్వంలో మానసిక వ్యధకు లోనయ్యారు. దీనికి తోడు తీవ్ర అనారోగ్యం ఆయనను వెంటాడి మృత్యువు కాటేసింది. ప్రొద్దుటూరులో కొవ్వూరు ఫ్యామిలీకి పేరుప్రఖ్యాతులున్నాయి. బాలచంద్రారెడ్డికి భార్య ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమారుడు సైతం కాంట్రాక్టరుగా పనిచేస్తున్నారు. 2004లో టీడీపీ, బీజేపీ అలయెన్సులో ప్రొద్దుటూరు టీజేపీ ఎమ్మెల్యేగా వరదరాజులరెడ్డిపై కొవ్వూరు బాలచంద్రారెడ్డి పోటీ చేసి ఓడిపోయాడు. బీజేపీ నేతగా కొన్నేళ్లుగా క్రియాశీలకంగా పనిచేశారు. ఇటీవల ఎన్నికల్లో వరదరాజులరెడ్డిని గెలిపించమని కూటమి సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల పోలింగ్‌కు ముందు వైసీపీని ఓడించమని వెంటిలేటర్ మీది నుంచే ఆయన పిలుపునిస్తూ వీడియో విడుదల చేశారు. బాలచంద్రారెడ్డి నిరంతర పోరాటయెధుడు. ఆయన మృతికి ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, టీడీపీ, బీజేపీ నేతలు పలువురు సంతాపం ప్రకటించారు.

గనులు, ఖనిజాల చెక్‌పోస్టులు ఎత్తేశారు

● మట్టి, చిన్న తరహా ఖనిజాల, రవాణా సినరేజ్ చార్జీలు రద్దు ● ప్రజలపై తగ్గిన ఆర్థిక భారం



సంబేపల్లె మండలంలో ఎత్తేసిన చెక్‌పోస్టు

సంబేపల్లె, జూన్ 20: జిల్లాలో వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన గనులు, ఖనిజాల చెక్‌పోస్టులను ప్రభుత్వం మారడంతో ఎత్తేశారు. ఉమ్మడి కడప జిల్లాలో విశేషమైన ఖనిజ సంపద ఉంది. వైసీపీ ప్రభుత్వంలో ఓ ప్రైవేటు సంస్థకు సినరేజ్ వసూళ్లకు గనులు, ఖనిజాలు తనిఖీ కేంద్రాల పేరిట చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ప్రజలపై ఆర్థిక భారాన్ని పెంచారు. మట్టి కూడా బంగారం అయ్యింది. మట్టితో సహా చిన్న తరహా ఖనిజాల రవాణాకు సీనరేజ్ వసూలు చేస్తూ తనిఖీలను ముమ్మరం చేశారు. ఇసుక, మట్టి ప్రజలకు భారం అయ్యింది. కొన్ని ప్రాంతాల్లో మట్టితో పాటు రాళ్ల ఉచితంగా తరలించేవారు. డీపీడీకి కళ్లెం వేయడం పేరిట ప్రైవేట్ సంస్థ సీనరేజ్ వసూల బాధ్యతలు చేపట్టారు. చెక్‌పోస్టులతో ప్రజలపై మరింత ఆర్థిక భారం పడింది.

ఉమ్మడి జిల్లాలో ఉన్న చెక్‌పోస్టులు ఇవే..

సంబేపల్లె, రాయచోటి, రామాపురం, కడప, రాజంపేట, యర్రగుంట్ల, వేముల, పులివెందుల, ప్రొద్దుటూరు ప్రాంతాల్లో ఉండేవి. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చెక్‌పోస్టులను ఎత్తేశారు.

నిర్మాణ వ్యయం భారంగా ఉండేది

రాయచోటి, సంబేపల్లె ప్రాంతాల్లో ప్రజలు పునాదుల అవసరాలకు కోసం బండరాళ్లు, మట్టి, ఇసుక, కంకర అవసరాల ఉండేవి. ట్రాక్టర్ కంకర రూ.2500 ఉండేది. సీనరేజ్ వసూళ్లతో రూ.3200కు పెంచారు. మట్టి గతంలో 500 ఉండేది. ప్రస్తుతం 900 రూపాయలు చేశారు. ఇసుక రూ.3వేల నుంచి రూ.3500 ఉండేది. ప్రస్తుతం రూ.4 వేల నుంచి రూ.4500కు పెంచారు. ఇలా ప్రతి ఒక్కటి పెంచి వైసీపీ ప్రభుత్వంలో ప్రజలపై ఆర్థిక భారాన్ని పెంచారు. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి రావడంతో చెక్‌పోస్టులను రద్దు చేశారు. దీంతో మట్టి, ఇసుక, కంకర ధరలు తగ్గడంతో ప్రజలపై ఆర్థిక భారం తగ్గిందని చెప్తున్నారు.

ఐదేళ్లలో దోపిడీ చేశారు



వైసీపీ ప్రభుత్వంలో సహజ వనరులు ఇసుక, మట్టి, కంకర రాయి ప్రైవేటు సంస్థకు అప్పగించి సినరేజ్ పనుల పేరుతో డోపిడీ చేశారు. సామాన్య ప్రజలకు గృహ నిర్మాణ వ్యయం పెరిగి భారంగా మారింది. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వంలో ప్రజలకు ఇలాంటి ఇబ్బందులు రావన్నారు.

- మల్లు నరసారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సంబేపల్లె

మహిళ బ్యాగు నుంచి బంగారు ఆభరణాలు చోరీ

కడప (క్రైం), జూన్ 20 : తన బ్యాగులోని బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని ప్రమీల అనే మహిళ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అన్నమయ్య జిల్లా గాలివీడు మండలానికి చెందిన పి.ప్రమీల దేవునికడపలో జరిగే బంధువుల వివాహానికి ఆర్టీసీ బస్సులో బయల్దేరింది. ఐటీఐ సర్కిల్ నుంచి సంధ్యా సర్కిల్‌కు వచ్చేలోపు తన బ్యాగు జిప్ తీయబడి ఉండడం ప్రమీల గమనించింది.

బ్యాగును తెరిచి చూసేసరికి అందులోని బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయని గమనించి లబోదిబోమంది. సంఘటన జరిగిన తరువాత కడప వన్‌టౌన్‌కు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ సంఘటనను విచారించి కడప వన్‌టౌన్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మెరుగైన విద్యాబోధన చేయాలి

డీఈఓ శివప్రకాశ్‌రెడ్డి

సంబేపల్లె, జూన్ 20: విద్యార్థులకు మెరుగైన విద్యాబోధనలు అందించాలని డీఈఓ శివప్రకాశ్ రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని యర్రగుంట్ల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులలో బోధనా నైపుణ్యాలపై పరిశీలించారు. పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించి త్వరితగతినే పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందాయా లేదా అని ఆరాతీశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందించాలని తెలియజేశారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠ్యంశాలను విద్యార్థులతో కలసి వీక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు ఆర్థిక సాయం అందించాలి

వేంపల్లె, జూన్ 20: మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతులకు ఆర్థికసాయం అందించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం వేంపల్లెలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, ప్రతి రైతుకు ఏటా రూ.20 వేల ఆర్థికసాయం అందిస్తామని టీడీపీ తన మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రైతులకు ఆర్థిక సాయం చేసేందుకు ఇది సరైన సమయమన్నారు. అలాగే కర్నూలు నగరంలో ఉన్న మానహక్కుల కమిషన్, లోకాయుక్త, వక్ఫ్, ట్రిబ్యునల్, ఆంధ్రప్రదేశ ఎలక్ట్రికల్ రెగ్యులేషన్ అథారిటీ తదితర ప్రభుత్వ కార్యాలయాలను అమరావతికి తరలించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు కొన్ని వార్తలు వచ్చాయని, తరలింపు ఆలోచన ఉంటే విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కడప జిల్లాలో ఉన్న యోగివేమన విశ్వవిద్యాలయం ప్రాంగణం నుంచి దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించాలని కొందరు తెలుగుదేశం పార్టీ వారు వైస్ చాన్సలర్‌కు వినతి పత్రం ఇవ్వడం శోచనీయమన్నారు. రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ప్రతిష్టించి దాదాపు 16 సంవత్సరాలైందన్నారు. రాజశేఖర్‌రెడ్డి ఈ విశ్వవిద్యాలయ వ్యవస్థాపకుడు కావున ఆయన విగ్రహాన్ని తొలగించడం సమంజసం కాదని తులసిరెడ్డి అన్నారు.


గుండెపోటుతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



మృతుడు సంతోష్ (ఫైల్)

సంబేపల్లె, జూన్ 20: 'ఉన్నత చదువులు చదివించాం. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చిందని సంతోషించాం.. కొడుకు ప్రయోజకుడయ్యాయడని అనుకునే లోపే చిన్న చూపు చూశావా దేవుడా' అని తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. మండలంలోని నాగిరెడ్డిగారిపల్లె గ్రామం మొటుకువాండ్లపల్లెకు చెందిన విద్యుత్ లైన్ మెన్ చంద్రశేఖర్ పెద్ద కుమారుడు సంతోష్ (24) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బెంగళూరులో గురువారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడి స్నేహితుడి వివరాల మేరకు.. జిమ్‌కు వెళ్లి రూముకు వచ్చిన సంతోష్ గుండెపోటుకు గురి కావడంతో హుటాహుటిన ఆసుపత్రికి తరలించి మృతుడి తల్లిదండ్రులకు సమాచారాన్ని అందించామని, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారన్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాదుబాబు భౌతికగాయాన్ని సందర్శించి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

గుర్తు తెలియని యువకుడు మృతి



గుర్తు తెలియని మృతదేహం

రైల్వేకోడూరు, జూన్ 20: పట్టణంలోని వైఎస్ఆర్ విగ్రహం టోల్గేట్ వద్ద ఉన్న టీ షాపు వద్ద గుర్తు తెలియని యువకుడు ఒక్కసారిగా గురువారం కుప్పకూలిపోయాడు. వెంటనే అక్కడ ఉన్న స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించి రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యువకుడిని పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ప్రభుత్వాసుపత్రికి వెళ్లి మృతుడి వివరాల కోసం వారు ఆరా తీశారు. ఎటువంటి సమాచారం తెలియకపోవడంతో ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ బాబు తెలిపారు.

లారీ - కారు ఢీ : నలుగురికి గాయాలు

ఒంటిమిట్ట, జూన్ 20: మండల పరిధిలోని కడప-చెన్నై జాతీయ రహదారిపై లారీ-కారు ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. కడప నుంచి రేణిగుంటకు వెళుతున్న లారీ, తిరుమల నుంచి కడపకు వెళుతున్న కారు ఢీకొనడంతో కడపకు చెందిన వెంకటనారాయణ(42) సాయి(13), పుణీత్, అనూహశ్రీ(32) అనే ముగ్గురు గాయపడ్డారు. వారిని రిమ్స్‌కు తరలించినట్లు హెచ్‌సీ రాజు తెలిపారు.

ఘనంగా నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు


అన్నదానం చేస్తున్న హరిప్రసాద్, గోవర్ధనరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), జూన్ 20 : టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడి సతీమణి నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు కడప నగరంలో ఘనంగా నిర్వహించారు. ప్రేమాలయ నిరాశ్రయుల వసతిగృహంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ ఆధ్వర్యంలో భువనేశ్వరి జన్మదినంతో పాటు మంత్రి కొల్లు రవీంద్ర జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి, వెంకటేశ్, ఎన్ఆర్ఐ బలిజ సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు, ధరణి, దండు అనిల్, శివ, అశోక్ పాల్గొన్నారు.

32వ డివిజన్‌లో...

32వ డివిజన్ టీడీపీ నాయకురాలు విజయలక్ష్మి కార్యాలయంలో నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి ఆధ్వర్యంలో భువనేశ్వరి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, సునీత, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీచెన్నకేశవ ఆలయంలో ప్రత్యేక పూజలు

కడప (ఎడ్యుకేషన్), జూన్ 20 : టీడీపీ జాతీయఅధ్యక్షులు చంద్రబాబు సీఎం అయితే చెన్నకేశవస్వామి ఆలయానికి పాదయాత్రగా నడిచి మొక్కుబడి చెల్లించుకోవడానికి కడప జిల్లా తొండూరు మండలం బోడివారిపల్లె గ్రామంలోని టీడీపీ నాయకులు చిన్నకుళాయిరెడ్డి వారి కుటుంబ సభ్యులతో బయల్దేరారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా తొండూరు మండలం టీడీపీ ఇన్‌చార్జ్ మారెడ్డి భరత్‌రెడ్డి మండల నాయకులు శివమోహన్‌రెడ్డి ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిన్ననరసింహారెడ్డి, భూమిరెడ్డిలోకనాదరెడ్డి, దేశం చంద్రారెడ్డి, బోడివారిపల్లె గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు పెద్దచెప్పలి యువత శుభాకాంక్షలు


ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న యువత

కమలాపురం రూరల్, జూన్ 20 : ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డికి మండల పరిధిలోని పెద్దచెప్పలి గ్రామానికి చెందిన ఎస్సీ సెల్ యూత్ అధ్యక్షుడు రఘునాథ్ ఆధ్వర్యంలో గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ కమలాపురం ఎమ్మెల్యేగా పుత్తాక్రిష్ణచైతన్యరెడ్డి విజయం సాధించడం ఎంతో ఆనందకరంగా ఉందన్నారు. శ్రీనివాసులు, రాఘవ జనార్ధన్, నాగేంద్ర, చింటూ, రామక్రిష్ణ, క్రిష్ణబాబు, ఓబులేసు, పెద్దచెప్పలి ఎస్సీ కాలనీ యువకులు పాల్గొన్నారు.

'శ్రీధర్‌రెడ్డి బారి నుంచి ప్రాణ రక్షణ కల్పించాలి'

కడప (మారుతీనగర్), జూన్ 20: తన భూమిని ఆక్రమించిన శ్రీధర్‌రెడ్డి బారి నుంచి తన కుటుంబానికి ప్రాణ రక్షణ కల్పించాలని సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ వైజాగ్ ప్రొటెక్షన్ అధికారి పీరాన్‌సాహెబ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి కడప జిల్లా చక్రాయపేట మండలం కుమారకాల్వ గ్రామానికి చెందిన తనకు చెం దిన భూమిని సదరు గ్రామానికే చెందిన వెంకటనారాయణ అనే వ్యక్తికి కౌలుకు ఇచ్చినట్లు వెల్లడించారు. ఆ భూమిలోని 7 సెంట్ల స్థలాన్ని అదే ప్రాంతానికి చెందిన వైసీపీ నాయకుడిగా చెలామణి అవుతున్న శ్రీధర్‌రెడ్డికి అమ్మినట్లు తెలిసిందన్నారు. దీంతో ఎస్పీకి ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. పైపెచ్చు తనపై రెండు సార్లు శ్రీధర్‌రెడ్డి దాడికి ప్రయత్నించాడన్నారు. కావున తనకు రక్షణ కల్పించడంతో పాటు ఆక్రమించుకున్న 7 సెంట్ల భూమిని తన స్వాధీనం చేయాలని కోరారు.

వేతనాలలో వ్యత్యాసాలు బాధాకరం

కడప (మారుతీనగర్) జూన్ 20: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలలో కాంట్రాక్ట్ పద్ధతిపై ఒకేషనల్ అండ్ కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్స్‌గా సేవలందిస్తున్న తమకు వేతనాలలో వ్యత్యాసం బాధాకరమని పలువురు ఇన్‌స్ట్రక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం కడపలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత 12 సంవత్సరాలుగా సేవలందిస్తున్నప్పటికీ కేవలం రూ.14,203 మాత్రమే తమకు ఇస్తూ టీచింగ్, నాన్ టీచింగ్ వారికి వేతనాలు పెంచడం బాధాకరమన్నారు. కాగా కేజీబీవీలో 2019లో కాంట్రాక్ట్ పద్ధతిలో పార్ట్ టైమ్ పద్ధతిలో చేరిన పీజీటీలను ఫుల్‌టైమ్ పీజీటీలుగా ఎంపిక చేసుకుని వారికి రూ.12,000 నుంచి ఏకంగా రూ. 26,705కు పెంచారన్నారు. కావున రాష్ట్రంలో కొలువుదీరిన నూతన ప్రభుత్వమైనా స్పందించి తమ వేతనాలను పెంచాలని కోరారు.

టీడీపీ మండల కన్వీనర్ మునిరెడ్డికి మాతృవియోగం

వేంపల్లె, జూన్ 20: వేంపల్లె మండల టీడీపీ కన్వీనర్ మునిరెడ్డి, ఎస్టీయూ జిల్లా మాజీ అధ్యక్షులు నరసింహారెడ్డిలకు మాతృవియోగం కలిగింది. వారి తల్లి సింగారెడ్డి సుబ్బమ్మ (92) గురువారం వయసు రీత్యా మృతిచెందారు. పలువురు నాయకులు బంధు మిత్రులు నివాళులు అర్పించారు. సంతాపం తెలిపారు. శుక్రవారం ఉదయం వేంపల్లెలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

కడప (ఎడ్యుకేషన్), జూన్ 20: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణం పరిక్షించుకోవాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి నజీవుల్లా తెలిపారు. గురువారం కడప నగరం మున్సిపల్ ప్రైమరీ ఉర్దూ స్కూలులో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషి తమ జీవితంలో కనీసం ఒక మొక్కైనా నాటి దానిని పరిరక్షించాలన్నారు. సీఎంటి ఛైర్మన్ షర్మా, సచివాలయ సిబ్బంది రాజేశ్వరి పాల్గొన్నారు.

దాతల సాయాన్ని వినియోగించుకోవాలి

సీకేదిన్నె, జూన్ 20:విద్యార్థులు దాతల సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని మండల విద్యాశాఖాధికారి వెంకటరామిరెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం సీఎంఆర్‌పల్లె ప్రాథమిక పాఠశాలలో గురువారం జరిగిన తల్లిదండ్రుల సమావేశాన్ని అమెరికాకు చెందిన దాత మనోజ్‌కుమార్‌రెడ్డి, మహేశ్వరులు రూ.15 వేలు విలువ చేసే బీరువా, విద్యార్థులకు పలకలు, నోట్‌బుక్స్, కాపీ రైటింగ్‌లను విద్యార్థులకు అందజేశారు.

సేవ ద్వారా సంతృప్తి

సీకేదిన్నె, జూన్ 20: సేవ ద్వారా ఎంతో సంతృప్తి కలుగుతుందని టీడీపీ నాయకులు, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ గంధం మోహన్‌బాబు తెలిపారు. ఇందిరానగర్ సమీపంలోని పద్మావతి వెంకటేశ్వర వృద్ధాశ్రమంలో ఏపీఎస్ఆర్‌టీసీ ఉద్యోగుల ఆధ్వర్యంలో బియ్యం పాకెట్లు, దుప్పట్లు, దోమతెరలు, నిత్యావసర సరుకులను గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, శివశంకర్, గంగిరెడ్డి, రాజానాయక్, రఘురాముడు, రెడ్డయ్య, లక్షుమయ్య, నాగరాజు, ఆనంద్‌బాబు, శివ, శంకర్‌రెడ్డి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

జీతాల చెల్లింపు ఉత్తర్వులు ఇవ్వాలి

కడప (ఎడ్యుకేషన్), జూన్ 20 : మినిమం టైం స్కేలు పద్ధతిలో పునర్‌నియామకం పొందిన 1998-2008 డీఎస్సీ ఉపాధ్యాయుల జీతాలచ చెల్లింపునకు ఉత్తర్వులు ఇవ్వాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేశ్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం డీఈఓ అనురాధను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ పాఠశాల విద్యాకమిషనరు జూన్ 12న ఎంటీఎస్ ఉపాధ్యాయులను పునర్నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారని, ఆ ఉత్తర్వులకు అనుగుణంగా జిల్లా విద్యాశాకాధికారి ఉత్తర్వులు ఇస్తేనే ఆ ఉపాధ్యాయుల జీతాలు చెల్లించడానికి వీలవుతుందన్నారు. వెంటనే ఉత్తర్వులు అందించి జీతాలు ఆలస్యంకాకుండా చూడాలని కోరారు. డీఈఓ స్పందిస్తూ ఎంటీఎఫ్ ఉపాధ్యాయులకు సంబంధించి ఉత్తర్వులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు నరసింహారావు, రమణ, ఎజాజ్ అహ్మద్, గోపీనాథ్, చంద్రశేఖర్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సమాజంలో ప్రజలంతా సమానమే'

కడప (మారుతీనగర్), జూన్ 20: సమాజంలోని ప్రజలంతా సమానమేననే భావనతో ప్రతి ఒక్కరూ నడచుకోవాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫకృద్దీన్ సూచించారు. జిల్లా న్యాయసేవ అధికారసంస్థ, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జిల్లాలోని హిజ్రాలు, ట్రాన్స్ జెండర్లకు ఆరోగ్య అవగాహన, రక్త పరీక్షల కార్యక్రమం నిర్వహించారు.

ప్రాజెక్టలను పూర్తి చేయాలి: బీజేపీ

కడప (మారుతీనగర్), జూన్ 20: ప్రాజెక్టలను పూర్తి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎన్‌జీవో కాలనీలో గల బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టలను పూర్తిచేయడంతో రైతులకు ఉపశమనం కలుగుతుందన్నారు. అలాగే వైఎస్ఆర్ కడప జిల్లాగా నామకరణం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణయాదవ్, రాష్ట్ర నాయకులు కందుల మురళీమోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు వి.వి. చలపతి, జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటసుబ్బారెడ్డి, రాష్ట్ర నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

శాఖలన్నింటికీ రెవెన్యూ మూల స్తంభం

● తహసీల్దార్ భీమేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ భీమేశ్వర్‌రావు

సింహాద్రిపురం, జూన్ 20: అన్ని శాఖలకు రెవెన్యూ శాఖ మూల స్తంభంలా ముడిపడి ఉందని తహసీల్దార్ భీమేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం సింహాద్రిపురం తహసీల్దార్ కార్యలయంలో రెవిన్యూ డే సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు ఇస్తూ మన కార్యాలయానికి వచ్చే ప్రజలకు చక్కటి సర్వీస్ అందించడం మొదటగా మనం నేర్చుకోవాల్సి ఉందన్నారు. వీఆర్ఏ మొదలుకొని, వీఆర్ఓలు, కార్యాలయ సిబ్బంది అందరూ పది మందికి సాయం చేయాలనే దృక్పథంతో నడుచుకోవాలన్నారు. కార్యాలయానికి వచ్చిన వారిని సరైన సమయంలో పని చేయకుండా రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పుకుంటూ, వారిని ప్రలోభాలకు గురి చేసే ప్రయత్నం మానుకోవాలన్నారు. ఆర్ఐ షేక్షావలి, వీఆర్ఏలు, వీఆర్ఓలు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ శాఖా మంత్రిని కలిసిన బీటెక్ రవి


విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవితో చర్చిస్తున్న బీటెక్ రవి

పులివెందుల టౌన్, జూన్ 20: రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవిని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి గురువారం విజయవాడలో కలిశారు. ఈ సందర్భంగా పులివెందులలో విద్యుత్ శాఖలో జరిగిన అవకతవకలు, కాంట్రాక్టు పనుల్లో ఇష్టానుసారంగా వ్యవహరించిన అధికారుల వివరాలను వివరించారు.

పులివెందుల ప్రాం తంలో నూతనంగా ఏర్పాటుచేసిన సబ్‌స్టేషన్లు, విద్యుత్ లైన్లలో భారీ అవినీతిజరిగిందని మంత్రికి వివరించారు. అలాగే విద్యుత్ శాఖలో వైసీపీ హయాంలో ఇష్టానుసారంగా అనుకూలమైన వారికి పోస్టులు ఇచ్చారని వివరించారు. వీటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

దళితుల భూ సమస్యలు పరిష్కరించాలి


భూములను పరిశీలిస్తున్న రవిశంకర్‌రెడ్డి

కడప (సెవెన్‌రోడ్స్), జూన్ 20 : పాత కడప దళితుల భూ సమస్యలు పరిష్కరించాలని ఆర్సీపీ నేతలు డిమాండ్ చేశారు. గురువారం పాత కడప దళితులతో కలిసి వారి భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో పాత కడప దళితులకు 2005లో అప్పటి వైఎస్ఆర్ ప్రభుత్వం భూములు పంపిణీ చేసిందన్నారు. అప్పటి దళితులు వారు ఆ భూములను సాగు చేసుకుంటున్నారన్నారు. కొంతమంది అగ్రకులాల వారు దౌర్జన్యంగా ఆ భూమి మాది అని ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారన్నారు.

గత ప్రభుత్వ అధికారులకు ఆ భూమి దళితులది అని చెప్పినా సమస్యను పరిష్కరించకుండా తాత్సారం చేశార న్నారు. తక్షణమే సమస్యను పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్సీపీ నగర కార్యదర్శి మగ్బుల్ బాషా, రాయలసీమ ట్రేడ్ యూనియన్ నాయకులు గంగన్న, అజయ్. దళితుల గిరిజన హక్కుల పోరాట సంఘం నాయకులు వెంకటేశ్, ఓబులేసు, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

యువజన రంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి


మంత్రిని కలిసిన డీవైఎఫ్ఐ సభ్యులు

కడప (సెవెన్‌రోడ్స్), జూన్ 20 : రాష్ట్రంలో యువజన రంగ సమస్యలు అనేకం ఉన్నాయని, వాటి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో విజయవాడలో రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలిసినట్లు డీవైఎఫ్ఐ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో యువజనరంగానికి తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా రాష్ట్రంలో క్రీడా మైదానాలు ఏర్పాట్లు కానీ, క్రీడలకు బడ్జెట్ కేటాయించడంలో కానీ నిర్లక్ష్యం వహించారన్నారు. కోచ్ పోస్టులు భర్తీ చేయాలని రానున్న రోజుల్లో యువజనరంగానికి క్రీడలకు అధికప్రాధాన్యత కల్పించాలని డీవైఎఫ్ఐ డిమాండ్ చేస్తుందని అన్నారు.మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర కార్యదర్శి రామన్న, రాష్ట్ర సహాయ కార్యదర్శి వీరనాల శివకుమార్, క్రిష్ణ పాల్గొన్నారు.

'ఆర్కిటెక్చర్ యూనివర్సిటీలో అక్రమాలపై ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి'


మాట్లాడుతున్న ఆర్ఎస్‌యూ నాయకులు

కడప (ఎడ్యుకేషన్), జూన్ 20 : ఆర్కిటెక్చర్ యూనివర్సిటీలో గత ఐదు సంవత్సరాల్లో అనేక అక్రమాలు జరిగాయని, వాటిపై విచారించి చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నకేశవ రెడ్డి డి మాండ్ చేశారు. గురువారం కడప నగరం ఆర్ఎస్‌యూ కార్యాలయం లో విలేకరులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్ బావమరిది వీసీ సురేంద్రనాథరెడ్డి అక్రమంగా కాంట్రాక్టు ఉద్యోగాలను అమ్ముకుని బంధువులకు తన వాళ్లకు నిబంధనలకు విరుద్ధంగా నియమించారన్నారు. దీనిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ నాయకులు హరిబాబు, అంజి, షరత్ తదితరులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ అనీమియాపై అవగాహన


ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ రేష్మ

పులివెందుల, జూన్ 20: సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని తొండూరు పీహెచ్‌సీ వైద్యాధికారి రేష్మ నిర్వహించారు. గురువారం మండల కేంద్రమైన తొండూరులో సికిల్ సెల్ అనీమియా నిర్మూలనకై ప్రజలతో కలిసిర్యాలీ నిర్వహించారు. తొండూరు మండలంలోని ఇనగలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఈ వ్యాధిపై అవగాహనకల్పించి లక్షణాలు, జాగ్రత్తలు వివరించారు. వ్యాధి నిర్మూలనకు పాటించాల్సిన సూత్రాలను వివరించారు. 2047 సంవత్సరం నాటికి సికిల్ సెల్ అనీమియా లేని భారతదేశం మన లక్ష్యమన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, సీహెచ్ఓ రమణమ్మ, సూపర్వైజర్ శశికళ, సిబ్బంది పాల్గొన్నారు.

జీఓ 117ను రద్దు చేయాలి: ఆర్‌జేయూపీ


మాట్లాడుతున్న గునిశెట్టి శ్రీనివాసులు

కడప (ఎడ్యుకేషన్), జూన్ 20 : జీఓ 117ను వెంటనే రద్దు చేయాలని ఆర్‌జేయూపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం ఆర్‌జేయూపీ టీచర్స్ హోంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమం కూడా కొనసాగించాలని, గతంలో మాదిరిగా ప్రాథమిక తరగతులైన 3, 4,5 తరగతులు ప్రాథమిక పాఠశాల్లో కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి వెంకటసుబ్బయ్య, వీరయ్య, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్నదానం


దివ్యాంగులకు అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

కడప(రూరల్) జూన్ 20 : కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి జన్మదినం సందర్భంగా 18వ డివిజన్ టీడీపీ నాయకుడు ఆవుల నాగేశ్వర్‌రెడ్డి గురువారం దివ్యాంగులకు అన్నదానం చేశారు.ఈ కార్యక్రమానికి కడప మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ గంధం మోహన్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కడప నగరం పాత రిమ్స్‌లోని ఆల్‌షిఫా దివ్యాంగుల పునరావాస కేంద్రంలోని మ ధ్యాహ్నం, రాత్రి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగులతో కేక్‌ను కట్ చేయించి వారితో కలిసి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా మోహన్‌బాబు మాట్లాడుతూ అన్ని దానాలలో కెల్లా అన్నదానం మిన్న అ న్నారు. నాగేశ్వర్‌రె డ్డి మాట్లాడుతూ దివ్యాంగుల మధ్య నిర్వహించుకొని వారికి అన్నదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. టీడీపీ నాయకులు ఎం.ఎ. బాషా, రామసుబ్బయ్య యాదవ్, శంకర్‌రెడ్డి, మారుతీ, సిరాజ్‌బాషా, చంద్ర యాదవ్, రహమాన్, ఫైయాజ్, క్రిష్ణయ్య, వసంతరెడ్డి, భయారెడ్డి, ప్రవీణ్, నరసింహులు, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలనే ధ్యేయం

నిబంధనలకు విరుద్ధంగా నడుచుకుంటే వేటు తప్పదు

మున్సిపల్ అధికారుల సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, జూన్ 20: అవినీతి రహిత పాలన అందించడమే నా ధ్యేయమని, నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ అధికారులు, సిబ్బంది నడుచుకుంటే వేటు తప్పదని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఇంజనీరింగ్ శానిటేషన్ రెవెన్యూ అధికారులతో సమీక్షించిన ఆయన తనశైలిలో అధికారులకు పలురకాల సూచనలు, హెచ్చరికలు జారీ చేశారు. మురుగునీటి వ్యవస్థ ప్రక్షాళన అత్యంత ప్రాధాన్యత గల అంశమన్నారు. రూ.163 కోట్లతో కాల్వల ఆధునీకరణలో అన్ని కాల్వలు వున్నాయాఅని ప్రశ్నించారు. గత పాలకులు కాల్వల్లో పూడిక తీత ఎన్నిమార్లు తీసి బిల్లులు చేసుకున్నారని ప్రశ్నించారు. వర్షాకాలం కాబట్టి తక్షణం రోడ్లపై నీళ్ళు ప్రవహించకుండా పూడిక తీత పనులను చేపట్టాలన్నారు. టౌన్ ప్లానింగ్ ఏసీపీ మునిరత్నం పనితీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నీవు చాలా అవినీతిపరుడవని నీ చిట్టా అంతా నా దగ్గర వుందని హెచ్చరించారు. గత పాలనలో జరిగిన అభివృద్ధి పనులు మీదే కాకుండా టౌన్‌ప్లానింగ్‌లో ఇచ్చిన అనుమతులు, రెవెన్యూలో వేసిన పన్నులు వీటన్నింటిపై విజిలెన్సుతో విచారణ జరిపిస్తానన్నారు. శానిటేషన్ వర్కర్లుగా జీతాలు తీసుకుంటూ ఆ పనులు చేయకుండా ఆఫీసుల్లో అధికారులు, నేతల ఇళ్లలో ఇతర చోట్ల పనిచేస్తూ వుండే వారిపై చర్యలు తీసుకోమని కమిషనర్ రఘునాథరెడ్డిని ఆదేశించారు. పనిచేయకుండా జీతాలు తీసుకుంటున్న వారిని తొలగించాలన్నారు. ఆర్‌ఐ శివచరణ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు, ఆయన బావమరిది బంగారురెడ్డికి అనుకూలంగా వ్యవరించారని ఇప్పటికైనా పద్ధతి మార్చుకుని మీ ఉద్యోగాలు మీరు చేయాలని హెచ్చరించారు. అధికారులు ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటూ పనిచేయాలన్నారు. అవినీతి డబ్బుకోసం పాకులాడకూడదన్నారు. ఎప్పుడు ఏ ఫైలు వస్తుందా అందులో ఎంత గుంజుదామా అనే ఆలోచనలు ఇప్పటి నుంచే విరమించుకుని పనిచేయాలన్నారు. కమిషనర్ కూడా ఆఫీసుకు పరిమితం కాకుండా క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్నారు. సమావేశంలో కమిషనర్ రఘునాథరెడ్డి, మున్సిపల్ ఈఈ సాయిక్రిష్ణ, డీఈలు దస్తగిరి రమణ, ప్రభా కర్ దాస్, ఏఈలు ఉమా, బ్యూలా, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గోవిందరెడ్డి, నూరు బాషా, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

బాలికలు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి


విద్యార్థినికి నగదు పురస్కారం అందజేస్తున్న గంగాధరరాజు

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 20: విద్య ద్వారా బాలికలు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆర్టీపీపీ ఏఈఈ గంగాధరరావు పేర్కొన్నారు. గురువారం ఎస్పీ సీఎస్ రామేశ్వరం మున్సిపల్ హైస్కూలులో టెన్త్ ఫలితాల్లో 583 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచిన విద్యార్థి సుష్మకు రూ.10 వేలు నగదు బహుమతి అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం సత్యబాబు మాట్లాడుతూ తమ పాఠశాలలో 84 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని 33 మంది 500 పైగా మార్కులు సాధించారన్నారు. 10 మంది విద్యార్థులు 100కు 100 మార్కులు సాధించి వంద శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ బద్వేలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No. 298/2023

1) మణ్యం సుబ్బారెడ్డి తండ్రి లేట్ సుబ్బారెడ్డి, వయస్సు 65సం., 2)మణ్యం ఆదిలక్ష్మమ్మ భర్త సుబ్బారెడ్డి, వయస్సు 55 సం., 3) మణ్యం రామసుబ్బారెడ్డి తండ్రి లేట్ సుబ్బారెడ్డి, వయస్సు 62 సం. 4) మణ్యం రాములమ్మ భర్త లేట్ నాగిరెడ్డి, వయస్సు 36 సం., 1 నుండి 5 వరకు అందరూ ప్రభలవీడు గ్రామం, బి.కోడూరు మండలం, వైఎస్ఆర్ కడపజిల్లా. - వాదులు

V/s

కత్తెరపల్లి చిన్నచెంచిరెడ్డి తండ్రి చెంచిరెడ్డి, వ. 34 సం., ప్రభలవీడు గ్రామం, బి.కోడూరు మం., వైఎస్ఆర్ కడపజిల్లా -11వ ప్రతివాది

పై నెంబరు దావాను షెడ్యూలు దాఖలా ఆస్తిపైన డిక్లరేషన్ కోరుచూ మరియు I.A. No. 1078/2023 పిటిషనర్‌ను పర్మినెంట్ ఇంజక్షన్ కోరుచూ వాదులు దాఖలు చేసి నారు. సదరు దావాలో మరియు I.A. No. 1078/2023 పిటిషన్‌లో 11వ ప్రతివాది అయిన నీకు ఏమైనా ఆక్షేపణలున్న యెడల 27-6-2024వ తేది ఉదయం 10.30 గంటలకు రాజశ్రీ కోర్టు వారి ఎదుట హాజరై తెలుపుకొనవలసినది. లేనంతట ఎక్సుపార్టీ గా తీర్మానించబడును. షెడ్యూలు : కడప డి. ప్రొద్దుటూరు ఆర్.డి. బద్వేలు సబ్.డి. బి.కోడూరు మండలం, ప్రభలవీడు గ్రామపొలంలోని సర్వే నెం. 493 య. 19.74 సెంట్లు పైకి య. 4.70 సెంట్లు. 1వ అయిటం : య. 4-00 ఉత్తరం : కత్తెరపల్లె వాణి మరియు రవికుమార్ రెడ్డి గార్ల భూమి, తూర్పు : సర్వే నెం. 495, పడమర : బద్వేలు టు బి.కోడూరు రోడ్డు, దక్షిణం : నాగిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి భూమి (కత్తెరపల్లి చెంచిరెడ్డి దగ్గర కొన్న భూమి) 2 అయిటం : య. 0.70 ఉత్తరం : మణ్యం నాగసుబ్బారెడ్డి భూమి, తూర్పు : రోడ్డు, పడమర : మణ్యం రామలక్షుమ్మ భూమి, దక్షిణం : నాగిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి భూమి, ఇల్లు

దేవిరెడ్డి బ్రహ్మారెడ్డి, అడ్వకేట్, బద్వేలు.

ఘనంగా శివాలయం రెండో వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో పరమశివుడు

కొండాపురం, జూన్ 20: గండ్లూరులో వెలసిన శివాలయంలో రెండో వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో పరమశివునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు గండ్లూరు నాగేశ్వరరెడ్డి, శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. భజన కూడా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

భారీగా మద్యం సీసాలు ధ్వంసం

ప్రొద్దుటూరు, జూన్ 20: పలు స్టేషన్ల పరిధిలో పట్టుబడిన మద్యం సీసాలను ఎస్పీ సిద్దార్థ కౌశల్ ఆదేశాల మేరకు సెబ్ పోలీసు అధికారుల సమక్షంలో ధ్వంసం చేశారు. ప్రొద్దుటూరు రూరల్ టూ టౌన్ వన్‌టౌన్ రాజుపాళెం పోలీసు స్టేషన్ల పరిధిలో సీజ్ చేయబడిన దాదాపు 98 కేసులు (2893 మద్యం) సెబ్ అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరిండెంట్ శ్రీనివాసులు సమక్షంలో ధ్వంసం చేశారు. ప్రొద్దుటూరు రూరల్, వన్ టౌన్, టూటౌన్ సీఐలు రమణా రెడ్డి, శ్రీకాంత్ కరీం, రాజుపాళెం ఎస్ఐ పాల్గొన్నారు.

కబ్జా స్థలాలను స్వాధీనం చేసుకోవాలి


కమిషనర్ ప్రమోద్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

జమ్మలమడుగు, జూన్ 20: పట్టణంలో వైసీపీ హయాంలో కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాలను మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, ఇతర అధికారులు పరిశీలించి వెంటనే స్వాధీనం చేసుకోవాలని జమ్మలమడుగు సీపీఐ కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం జమ్మలమడుగు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఐదేళ్ల నుంచీ మున్సిపల్ పరిసర ప్రాంతాల్లో స్థలాలు కబ్జా అయ్యాయని, కొందరు వ్యాపారాలకు ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. మరికొన్ని చోట్ల వ్యాపారులను డిమాండ్ చేసి డబ్బు తీసుకుంటున్నారని, అధికారులు పరిశీలించి కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు.

క్షయ నిర్మూలనే ధ్యేయంగా పనిచేయాలి

బద్వేలు రూరల్, జూన్ 20: క్షయ నిర్మూలనే ధ్యేయంగా పనిచేయాలని తొట్టిగారిపల్లె ప్రాథమికారోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వినయకుమార్ కోరారు. గురువారం స్థానిక నందిపల్లెలో బీసీజీ టీకాల కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడారు. సూపర్‌వైజరు నరసింహప్రసాద్, బ్రహ్మారెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు జనార్ధనరావు, శ్రీరాములయ్య, ఏఎన్ఎం పాల్గొన్నారు.

కొవ్వూరు బాల చంద్రారెడ్డి మృతి తీరని లోటు

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 20: బీజేపీ నేత కొవ్వూరు బాలచంద్రారెడ్డి మృతి ప్రొద్దుటూరు నియోజకవర్గ ప్రజలకు తీరని లోటని జనసేన పార్టీ నేత మాదాసుమురళి పేర్కొన్నారు. ఆయన ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధికోసం ఎంతగానో పరితపించారని పట్టణ ప్రజలకు మంచినీటి కొరత లేకుండా చేయడానికి పెన్నానదిలో సొంత నిధులతో అడ్డుకట్ట నిర్మించారని తెలిపారు. పట్టణంలో దోమల నివారణకు మడూరు కాల్వ పరిశుభ్రతకోసం, పట్టణ అభివృద్ధికోసం అనేక ఉద్యమాలు నిర్వహించారన్నారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు ఒక ప్రకటనలో ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రోడ్డుకు అడ్డంగా మద్యం వాహనం


రోడ్డుకు అడ్డంగా వాహనం పెట్టి మద్యం అన్‌లోడ్ చేస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల, జూన్ 20: అది జాతీయరహదారి. చుట్టూ సుమారు నాలుగైదు కర్మాగారాలు నడుస్తున్నాయి. దీంతో సిమెంట్ లోడ్, అన్‌లోడ్ వాహనాల రవాణాతో భారీ రద్దీగా వుంటుంది. అయినా సరే మాకేంటి మేము రోడ్డుకు అడ్డంగానే వాహనం పెడతాం. ఎవరితో చెప్పుకుంటారో చెప్పుకోండన్న ధీమా వారిది. పట్టణంలోని ప్రభుత్వ మద్యం దుకాణాలకు మద్యం సరఫరా చేసే వాహనాలు రోడ్డుకు అడ్డంగా గంటల తరబడి నిలుపుతూ మద్యం బాక్సులను అన్‌లోడ్ చేస్తున్నారు. దీంతో వాహనాలు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. అదీకాక యూటర్న్ కూడా ఉండడంతో వచ్చి పోయే వాహనాలు ఢీకొనే ప్రమాదాలు లేకపోలేదు. ఇలా రోజూ అన్ని మద్యం షాపుల వద్ద మెయిన్‌రోడ్డుపై జరుగుతున్న తంతు. వీటిపై పోలీసులు మాత్రం చర్యలు తీసుకోవడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

పూర్తి పరిహారం చెల్లించాలని వినతి


బాధితులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

ముద్దనూరు జూన్20: తమ ఇళ్లకు పూర్తి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆర్డీఓ శ్రీనివాసులు ఎదుట నేషనల్ హైవే బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దారు కార్యాలయంలో కమ్మవారిపల్లె ప్రజలతో ఆర్డీఓ మాట్లాడుతూ కమ్మవారిపల్లెలో నేషనల్ హైవే విస్తరణలో భాగంగా రోడ్డు పక్కన ఇళ్ల స్థలం సగం మాత్రమే రోడ్డుకు అవసరం ఉంటుందని, దానికి మాత్రమే పరిహారం చెల్లిస్తామన్నారు. డి-ఫారంతో ఏర్పాటు చేసుకున్న ఇళ్లకు వ్యాల్యుయేషన్ ప్రకారం పరిహారం చెల్లిస్తామన్నారు. కొంత ఇళ్లు మాత్రమే మిగిలితే ఉపయోగకరంగా ఉండదని, ఇంటికి పూర్తి నష్ట పరిహారం కల్పించాలని బాధితులు కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.





PUBLIC NOTICE

Iam instructed by my client - Firm M/s Shriram Finance ltd., Badvel Branch Rep. by the Branch Manager to publish this notice as follows : **Smt. Veerapogu Gnanamma W/o Balaswami** r/o Kavalakuntla Village and Post, Porumamilla Mandal, Kadapa District has applied for loan offering the below mentioned property as security. On scrutinizing the documents over the property, my client- Firm decided to grant loan to the applicant named above. Hence if anybody has got any objection/ any right over the property and if any litigations are pending in the Court of Law over the property. It shall be brought to my clients notice with documentary proof, else, it will be proceed further in the matter. If any such objections received after five days they will not be taken into account. Description of Property : Kadapa Dt, Badvel Sub-Dt, Porumamilla Mdl, Porumamilla Village fields, Porumamilla Grama Panchayat, 11th ward. Survey No. 16/2 B1, Ac. 0.01.307 Sq. Yards out of 126.55 Sq. yards. Existing Boundaries : East - Rastha leading to Thur-aka Kota, West - Thette wall of Govindaiahpalli Lakshumma, North - Site of Veerapogu Chinna Guraiah, South - Road, Measurements: East - West Northern Side - 32 ft. (9.69 Meters) Southern Side 25 Feet (7.57 Mtrs), North - South - 20 Feet (6.06 Mts.) with all easement Rights. In the said measurement of site construction completed up to slab level.

P.RAJESWARA RAO
ADVOCATE, BADVEL.

జీఓ 117ను రద్దు చేయాలి : ఎస్టీయూ

కలసపాడు, జూన్ 20: ప్రభుత్వ విద్యారంగానికి తీవ్ర ప్రమాదకారిగా పరిణమించిన జీఓ 117ను రద్దు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి నూతన ప్రభుత్వాన్ని కోరారు. సంఘ సభ్యత్వ నమోదులో భాగంగా ఇ.రామాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అనాలోచితంగా చేపట్టిన పాఠశాలల విలీన ప్రక్రియ కారణంగా గ్రామీణ ప్రాంతాల్లోని పేద బడుగు, బలహీన వర్గాల పిల్లలు ప్రభుత్వ విద్యకు దూరమవుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జీఓ 117ను రద్దు చేసి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను యథావిధిగా కొన సాగిస్తామని మంత్రి నారాలోకేశ్ ఇచ్చిన హామీని అమలు చేసే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎం.శేఖర్‌బాబు, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్వీ సత్యనారాయణ, జిల్లా కమిటీ కన్వీనరు కేవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

పాదయాత్రగా టీడీపీ నేతలు

ముద్దనూరు జూన్20: వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గం తొండూరు మండల బోడువారిపల్లె టీడీపీ నేతలు చేపట్టిన పాదయాత్ర గురువారం ముద్దనూరు మండలానికి చేరుకుంది. చంద్రబాబు సీఎం అయితే వనిపెంటలోని చెన్నకేశస్వామి వద్దకు పాదయాత్రగా వస్తామని మొక్కుకున్నారు. చంద్రబాబు సీఎంగా ప్రమాణం చేయడంతో మొక్కు తీర్చుకునేందుకు కాలినడక బయలుదేరారు. కార్యక్రమంలో కుళాయిరెడ్డి, శ్రీరాములు, పవన్ కల్యాణ్, నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యను అంబేడ్కర్ పేరుపై మార్చడం హర్షణీయం

బద్వేలు రూరల్, జూన్ 20: గత ప్రభుత్వంలో ఉన్న విదేశీవిద్యను టీడీపీ ప్రభుత్వం అంబేడ్కర్ ఓవర్‌సీస్ విద్యానిధిగా పేరు మార్చడం టీడీపీ సీనియర్ నేత గొల్లపల్లె మల్లయ్య, టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి వాల్తాటి దానం హర్షం వ్యక్తం చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం విదేశీ విద్యా పథకానికి జగన్ పేరు మార్చి ఆ పథకాన్ని నీరుగార్చి దళితులకు ఉన్నత విద్యను దూరం చేశారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం ఎస్సీ సంక్షేమ పథకాలు, ఎస్సీ కార్పొరేషన్ నిధులు, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించి ఆ పథకాలను నిర్వీర్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వంలో ఆ పథకాలన్నీ అమలవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. టీడీపీ ఎస్సీ నేతలు రాయప్ప, భాస్కర్, చెన్నయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో ఘనంగా రెవెన్యూ దినోత్సవం

ఎర్రగుంట్ల, జూన్ 20: ఎర్రగుంట్లలో రెవెన్యూ దినోత్సవాన్ని గురువారం తహసీల్దార్ సౌజన్యలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ముగ్గులువేసి పరిసరాలను అలంకరించారు. సర్వేయింగ్ మిషన్లు, తూనికలు, కొలతలు, ఇతర సామగ్రిని ప్రదర్శించారు. విశ్రాంత వీఆర్‌ఓ వెంకటస్వామిరెడ్డిని ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సేవలను ప్రజలకు మరింత సులభతరంగా, చేరువయ్యేలా పనిచేయాల్సిన అవసరం వుందని పిలుపునిచ్చారు. భూపరిపాలన, సంక్షేమ శ్రేయోభివృద్ధికి ధృవపత్రాల జారీ నిబంధనల మేరకు అందించాలని ఆలస్యం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



లక్ష్యాలకనుగుణంగా పనిచేయాలి : ఎంపీడీఓ

గోపవరం, జూన్ 20: అధికారులు లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని ఎంపీడీఓ రాధాక్రిష్ణ సూచించారు. మండల కార్యాలయంలో మండల, గ్రామస్థాయి అధికారులతో సమీక్షించిన ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలు, ఉపాధి కింద పండ్ల తోటలు పెంపకం, పారిశుధ్యం, సాగునీటి సరఫరా పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రసల్ సిస్టం, బయోమెట్రిక్ హాజరు తదితరాలపై సమీక్షించారు. పీఎం కిసాన్ నిధులు వారం తరువాత కూడా అకౌంటులో జమ కాని రైతులు సమీప రైతు భరోసా కేంద్రంలో తగు ఆధారాలు ధృవీకరణ పత్రాలతో సంప్రదించాలన్నారు. పీఎం కిసాన్ ఫిజికల్ వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. మెడికల్ ఆఫీసరు టీబీ టీకాలు, అనీమియా గురించి వివరించారు. సచివాలయ సిబ్బంది కార్యాలయ వేళల్లో ఉండాలని సమయపాలన పాటించాలన్నారు. తదుపరి సమీక్షకు అంశాల వారీ లక్ష్యం సాధించిన ప్రగతి నివేదికలతో హాజరు కావాలన్నారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, షూస్ బడిపిల్లలకు అందించాలని, డ్రాపౌట్స్ లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ ప్రయోజనాలు అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ అందేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ మండల సమగ్రాభివృద్ధికి బాధ్యతగా పనిచేయాలని మండల ప్రత్యేకాధికారి నాగరాజు సూచించారు. డిప్యూటీ తహసీల్దారు చంద్రలీల, మెడికల్ ఆఫీసరు ఈఓపీఆర్‌డీ హసీనా, ఎంఈఓ, మండల ఇంజనీరు అధికారి, తాగునీరు, పారిశుధ్యం ఉపాధి హామీ ఏపీఓ, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిజియోథెరపీపై ప్రధానోపాధ్యాయులకు శిక్షణ

కొండాపురం, జూన్ 20: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంఆర్సీలో ఫిజియోథెరపీపై గురువారం ఒకరోజు శిక్షణ నిర్వహించారు. నిజాం ఫిజియోథెరపీ సంస్థ, హైదరాబాద్‌కు చెందిన స్టేట్ ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపీపై ప్రధానోపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. నేటి ఆధునిక కాలంలో వచ్చే వ్యాధులను ఫిజియోథెరపీలోని వివిధ పద్ధతుల ద్వారా ఏవిధంగా నయం చేసుకోవచ్చునో ఆయన వివరించారు. ఎంఈఓలు ఓబులేసు, రామయ్య, ఫిజియోథెరపిస్టు డాక్టర్ హిమజ పాల్గొన్నారు.

ఉపశమనం కలిగిస్తుంది

చాపాడు, జూన్ 20: దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు ఫిజియోథెరపి చేయించుకుంటే చాలా వరకు ఉపయోగం ఉంటుందని ఫిజియోథెరపి డాక్టర్లు రమేష్, వెంకటరమణ అన్నారు. చాపాడులోని ఎమ్మార్సీ భవనంలో గురువారం హెడ్మాస్టర్లకు ఫిజియోథెరపిపై అవగాహన చేపట్టారు. డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ఇటీవల చాలా మంది బీపీ, షుగర్, తలనొప్పి, పార్శ్వ తలనొప్పి, బ్యాక్‌పెయిన్, నరాల నొప్పి వంటి వాటితో బాధపడుతున్నారన్నారు. ఇలాంటి బాధలను పోగొట్టేందుకు ఫిజియోథెరపి దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ సావిత్రి, ఎంపీడీఓ పుల్లయ్య, ఎంఈఓలు రవిశంకర్, వంశీకృష్ణ, ఐఈఆర్‌పీలు గంగాదేవి, ప్రేమకుమారి పాల్గొన్నారు.

